ఓమ్ శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

శ్రీ సరస్వతీ దేవ్యై నమః

ఓమ్ నమో భగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ప్రథమ శతకమునందలి చతుర్ధ (నాలుగవ) స్తబకము)

**అవ :-** ప్రథమ శతక సంబంధియగు నీ నాలుగవ స్తబకమున ఆధ్యాత్మమగు మహాశక్తి - కుండలినీ స్వరూపిణిగా స్తుతింపఁబడుచున్నది.

ప్రసంగవశమున ఛాందోగ్య శ్రుతిప్రతిపాదితమగు రీతిననుసరించి - తేజస్సారాంశమగు వాక్కుయొక్కయు, అప్ (జల) సారాంశమగు ప్రాణము యొక్కయు, అన్న సారాంశమగు మనస్సు యొక్కయు, అధిపిండములగు స్థానములను వివరించుచు నైష్ఠికుఁడగు నీయాచార్యుడు - స్వానుభవములను - భగవానుఁడగు రమణమహర్షి యుపదేశములను - తన కవితాచాతుర్యముచేఁ బ్రకటించుచున్నాఁడు.

మూ॥ అమృతాంశు బిమ్బసారాద్
భుయోఽపి వినిర్గతో భృశం సూక్ష్మః।
సారో గౌరీవదనాద్
దరహాసో హరతు దుఃఖజాలం నః॥ 1

గీ. అమృత కరబింబ సారమా హైమవతి ము
ఖమ్మునందుండి మిగుల సూక్ష్మమయి తిరుగ
దొరలుచుండినసార మాదర హసితము-
తొలంగఁజేయును గాత మాదుఃఖసమితి.



గౌరీముఖమునుండి వెలువడిన సారమగు దరహాసము - (చిరునవ్వు) మిక్కిలి సూక్ష్మమును, రసరూపమునునగు అమృతాంశుచంద్ర (చంద్ర) బింబసారము కంటెను మిగుల సూక్ష్మమై, సూక్ష్మ దృష్టులకే గోచరించును. ఆ మందహాసము మాదుఃఖ సమితిని తొలగించుఁగాక!

**ప్రభ :-** ఇంకొక విధమగు నర్థసమన్వయమున నీ శ్లోకార్థము నిట్లెఱుంగునది. 'అమృతాంశు బింబ (చంద్రబింబ) సారమగు గౌరీవదనము నుండి తిరుగ బయలు వెడలుచున్న సారమగు చిరునవ్వు - మా దుఃఖజాలమును నశింపఁజేయు గాత.

**ప్రభ :-** మీఁది యభిప్రాయములు రెండును తెలుఁగు పద్యమునందుఁ గూడఁ గలవని యెఱుంగునది.

అమృతకరబింబ సారమా? హైమవతి... దొరలుచుండి సారము? అను ప్రశ్న రూపమగు నర్థ పర్యాలోచనముచే హైమవతియగు గౌరీదేవి యొక్క ముఖము నందలి సారమగు దరహాసము - చంద్ర బింబసారము కంటెను గూడ సూక్ష్మమగుట చేత నధికమయినదను మొదటి యర్థమును, అమృతకరబింబసారమగు నా యుమాదేవి ముఖము నుండి మిక్కిలి సూక్ష్మమై బయలువెడలుచున్న సారమే ప్రసిద్ధమగు నామె దరహాసము. అని భావించుట చేత రెండవయర్థమును నేర్పడును.

**విశే :-** చిరునవ్వు - సంతోషదాయకము, కావున దుఃఖధ్వంస ముపపన్నమగును. ఆదరహాసము - గౌరీవదనసారమనుట చేత మిక్కిలి సూక్ష్మమయి ఘనీభవించి రసమను మారు పేరుగల యమృతమే - గౌరీముఖమగుచున్నదను నంశమాక్షేపింపఁబడుచున్నది.

శక్తి - అమృత స్వరూపిణియను నంశము - కడచిన స్తబకమునందే ప్రతిపాదింపఁబడినది. ఆయంశము నిచ్చట స్మరించునది.

మొదటియర్థమున గౌరీవదనము - అమృతాంశు బింబముతో నుపమింపఁబడి యస్ఫుటమైయున్నది.

రెండవయర్థమున - అమృతాంశు బింబసారమగు నమృతమే - గౌరీముఖమై యున్నది.

'సారమగు నాముఖమునుండి తిరుగ బయలువెడలిన సారమే దరహాసము' అని చెప్పుటచే నిందున్నది సారాలంకారమగుచున్నది.

**అవ** :- మన శరీరమునందున్న భగవతి యొక్క వ్యాపారత్రయమును, స్థానత్రయమును దెలుపుచున్నాఁడు.

మూ॥ కులకుణ్డే(ప్రణువన్తీ చేత స్తీహృది సమ స్తజన్తూనామ్।
మూర్ధని విచిన్తయన్తీ మృత్యుఞ్జయ మహిషి! విజయ తేభవతీ ॥ 2

గీ. అంబ! మృత్యుంజయ మహిషివయిన నీ స
దాత్మ - కుల కుండమందు శబ్దాయమాన।
సకలజంతు హృదులయందు, జ్ఞానరూప
మూర్ధమున ధ్యానరూపయై - పొలుచుఁగాదె?

అమ్మా! నీవు మృత్యువును జయించిన జగద్రాజగు పరమేశ్వరుని పట్టపురాణివి. మహిషివని చెప్పఁబడుచున్నావు గావున మృత్యుంజయుడగు నీశ్వరునకుఁగూడ నమృత శరీరవగు నీవు పూజింపఁదగినదానవు.

నీ స్వరూపము - జంతు శరీరములం దన్నింటను మూడుస్థలములందుండి మూఁడు పనులను జేయుచున్నది. నీవు కులకుండమను పేరు గల మూలాధారచక్రము నందు కుండలినీ శక్తివై ధ్వనించుచుందువు. హృదయమున సంవిత్ స్వరూపిణివై ధ్యానించుచున్నావు.



**ప్రభ** :- పర, పశ్యన్తి, మధ్యమ, వైఖరి, అని వాక్కు౪ విధములగు చుండునని పూర్వులు చెప్పియున్నారు.

అందు 'పరావాక్కు' మిక్కిలి సూక్ష్మమగుటచే స్పష్టముగానిదై కుల కుండాఖ్యమగు మూలాధారమునందుండును.

ఈ మహాశక్తి - మూలాధారమున వాగ్రూపయు, హృదయమున చిత్తిరూపము, శిరస్సున మనో రూపయునగుచు మన శరీరమునందున్నది. ఈ శక్తి యొక్క అనుగ్రహమువలననే దేహధారులకందఱకును అమృతత్త్వము సిద్ధించును.

ఆమె అమృతమూర్తియను నంశము ప్రసిద్ధము గదా!, ఈ మహాశక్తి - మృత్యుంజయునకుఁ గూడ పూజింప దగినదని సంబోధించుటచేత- ఆమెయే 'సర్వ జీవానాధార' అను నంశము ధ్వనింపఁజేయఁబడినది.

**అవ** :- ఇప్పుడు ఛాందోగ్య శ్రుతి వచనము నాదరించి తేజోబన్నసారము లగు వాక్ - ప్రాణ - మనస్సులకు, వరుసగా, మూలాధార - హృదయ - శిరస్సులు - లక్ష్యస్థానములగునని చెప్పుచున్నాఁడు.

శ్లో॥ తేజోజలాన్న సారైస్త్రయోఽణవో మూలహృదయమస్తేషు
పాకాత్తే నిష్పన్నా స్త్రైలోక్య వ్యాపికేఽన్బు! దేహవతామ్. 3

గీ. దేవీ! భువనమాత! తేజోజలాన్న సా
రములచేఁ(దిలోక సముది తాత్మ!
మూల, హృదయ, శీర్షముల - భవత్పాక, మా
హాత్మ్యమున, నణు త్రయంబుగల్గె.

దేహధారుల కందఱకును మాతవును, మూడులోకములందును వ్యాపించుచున్న దానవునునగునో దేవీ!

నీ యొక్క పరిణామ ప్రభావము వలన తేజస్సారము చేత మిగుల సూక్షమును, వాగ్రూపమును నగు నణువేర్పడి మూలాధారమునందున్నది జలసారము చేత నేర్పడిన ప్రాణరూపమగు నణువు – హృదయమునందున్నది. అన్న సారముచేత నేర్పడిన మనోరూపమగునణువు శిరస్సునందున్నది.

**ప్రభ** :- తేజస్సారమగు నణువే. వాక్కు జలసారమగునణువే, ప్రాణము. అన్నసారమగు నణువే, మనస్సు. ఇదియంతయు త్రైలోక్యవ్యాపిని యగు మహాశక్తి యొక్క పాక క్రియా ప్రభావము వలన నధిపిణ్డమై యున్నదని భావము.

(అమ్మ – వండిన వంటకములే – ఈవాక్ – ప్రాణ మనస్సులు) ఛాందోగ్యశ్రుతి. 'అన్నమశితం త్రేధావిధీయతే' అని యారంభించి

అన్నమయం హి సోమ్యమనః... ఓ సౌమ్యుఁడా! మనస్సు – అన్న మయము గదా!

అపోమయః ప్రాణః ... ప్రాణము – జలమయము.
తేజోమయీ వాక్ ... వాక్కు – తేజోమయము.
అని చెప్పుచున్నది.

**అవ** :- ప్రాణుల శరీరములం దీశక్తి ప్రవేశించు విధమును దెల్పుచున్నాఁడు.

మూ॥ పూర్ణే శరీరశిల్పే ద్వారేణ బ్రహ్మరన్ధ్ర సంజ్ఞేన।
నాడీ పథేన గత్వా తైజసమణు మావిశస్యమేయబలే॥ **4**

కం. క్రమసరణి దేహ నిర్మా
ణము పూర్ణముగాగ, బ్రహ్మ నాడీరంధ్రా
గమనమున నరిగి చొచ్చెద
వమేయబల! తైజసాణువయిన పరోక్తిన్.



తల్లీ! నీ బలమింతటిదని కొలుచుటకు శక్యముగాకున్నది. ఈ శరీర శిల్పము (రచన) పూర్తికాగానే నీవు – బ్రహ్మరంధ్రమను పేరు గల ద్వారమగు నాడీమార్గమునంబోయి – శరీరములోఁ బ్రవేశించి, తైజసమగునణువగు పరవాక్కునం దంతటను ప్రవేశించుచుందువు.

**ప్రభ** :- బ్రహ్మరంధ్రమను ద్వారము – శిరస్సు పై నున్న మధ్య భాగమునన్నది. అది యోగిలోక ప్రసిద్ధము. ఈ బ్రహ్మనాడి స్థూలమగు నరము కాదు. శిరఃప్రదేశమునుండి, మూలాధారము వఱకును గల నాడీ చక్రము యొక్క నడుమను సూక్ష్మమై, శక్తి ప్రవాహినయగుచున్న నాడియే యీ బ్రహ్మరంధ్రమను పేరు గల నాడియని యెఱుంగునది. ఈ మధ్యనాడినే కొందఱు 'సుషుమ్నానాడి' అని చెప్పుదురు.

**అవ** :- శక్తి యొక్క రాకపోకలకు మార్గములను దెలుపుచున్నాఁడు.

మూ॥ అంశేనావిశ్యాదౌ యాసి పునస్త్వం తతశ్చ నిర్యాసి।
మార్గాభ్యాం ద్వాభ్యాంత్వం నాడ్యాః పశ్చాత్ పురశ్చ సిద్ధాభ్యామ్॥ **5**

కం. స్వగతాంశమునను దైజస
మగు నణువునఁ జొచ్చి, తిరుగ నరిగెద వూర్ధ్వం
బుగ – నాడీ పశ్చాద్భా
గగము, పురోగము, నగుచు నెగడు మార్గములన్.

నీవు మొదట నొకయంశము (కలా విశేషము) చే తైజసాణువును, పరావాగ్రూపమును, నగు మూలాధారమునందుఁ బ్రవేశించి, మరలనచ్చటి నుండి మీదుగా నిర్గమించుచుందువు. ఇంతకు ముందు చెప్పఁబడిన మధ్యనాడికి – ఎడమ ప్రక్కను, కుడిప్రక్కను గల మార్గముల నుండి నీవీ ప్రవేశ – నిర్గమములను జరుపుచుందువు.

**ప్రభ** :- శక్తి – శిరస్సు నుండి మూలాధారమునకుఁ బోవుటకును, మూలాధారమునుండి, మీదికి వెళ్ళుటకును, గల మార్గమొక్కటికాదు. ఆ మార్గములు. రెండు. బ్రహ్మరంధ్రమను నాడికెడమ ప్రక్కనున్న బ్రహ్మరంధ్ర ద్వారము నుండి శక్తి దిగుననియు, కుడిప్రక్కనున్న బ్రహ్మరంధ్ర ద్వారము నుండి మీదికెక్కుననియు తెలిసికొనవలయును.

**అవ** :- ఆధేయమగు శక్తి విహారమున కీశరీరమునందగు నాధారమును (ఉపాధిని) జెప్పుచున్నాఁడు.

మూ॥ యాతా యాతవిహారే మాత సస్తస్మిన్ భవత్యుపాధిస్తే
ఆరభ్య మస్తకస్థల మామూలాధార మస్థిపఞ్జరికా ॥ 6

గీ॥ అంబ! నీవిట్లు పశ్చాత్పథావరోహ
ణము, పురోవివరారోహణము, నొనర్ప
మూర్ధమాది, మూలాధారము వఱకుం,గ
లట్టి యస్థిపంజరిక – నీకగునుపాధి.

తల్లీ! నీవిట్లు – ఎడమ ప్రక్కనున్న బ్రహ్మరంధ్ర ద్వారము నుండి దిగుటకును, కుడిప్రక్కనున్న బ్రహ్మరంధ్ర ద్వారము నుండి యెక్కుటకును గూడ శిరస్సు మొదలుకొని మూలాధారమువఱకును గల యస్థిపంజరమే ఉపాధి (ఆధారము) అగుచుండును.

**ప్రభ** :- మీఁదఁ దెలుపఁబడినదియు, నాడీచక్రము నావరించియున్నదియు, నగు నస్థిపంజరమే – నీవిట్లు తిరుగుట కాధారమగుచున్నదని భావము.

**అవ** :- ఈ శక్తికి 'కుండలిని' అను పేరిడుటకు; గారణమును దెలుపుచున్నాడు.



మూ॥ నృతనుషు విహరన్తీంత్వాం ఉపాధి వీణాకృతేర్జగన్మాతః
సాదృశ్యాత్ కుణ్డలినీం పరోక్ష వాదప్రియాః ప్రభాషన్తే॥ 7

కం. జనదేహ విహారిణివగు
నిను వీణాకృత్యుపాధినిం గుండలిఁ బో
లినదానిఁ గుండలినివని
అనియెడు పరోక్షవాగ్రతాత్ములు, జననీ!

అమ్మా! నీవీ మనుష్య శరీరములయందు పూర్వోక్త విధమున సంచరించుచుండుట వలన నీకు వీణ వంటి యాకారముగల యుపాధియగు నస్థిపంజరిక తోడి సాదృశ్యము గల్గినది. కావున పరోక్ష వాద ప్రియులు – అనఁగా, ఏ విషయమునైనను గూఢముగాఁ జెప్పుటయందిష్టముగల వారు, అగు దేవతలు – సర్పాకారమగు నాయస్థిపంజరిక (వీణానాదము) తోడి సాదృశ్యమువలన నిన్ను కుండలినీ శక్తి వని జెప్పుదురు.

**ప్రభ** :- కుండలిని నుద్దేశించి ప్రాచీనులీ క్రిందియభిప్రాయమును జెప్పియున్నారు.

కులకుండమను పేరు గల మూలాధారచక్రమున శక్తి నిద్రించుచు, యోగ ప్రభావమున మేల్కొని మీదికి వెడలి శిరస్సునందున్న సహస్రారచక్రమునఁ బ్రవేశించును. కుండలియనఁగా, సర్పము, (పడగగలది) ఆ సర్పము తన శరీరమును చుట్టగాఁ జుట్టకొని నిద్రించి మేల్కొని శరీరమునెత్తి, పడగ విప్పి మీఁదికి లేచునట్లు, ఈ శక్తి గూడా యోగ ప్రభావమున మేల్కొని విజృంభించుచుండును. కావుననే, మహాశక్తి – అధ్యాత్మముగా 'కుండలినీ శక్తి' అని ప్రసిద్ధమగుచుండునని భావము.

'అవాప్య స్వాంభూమిం భుజగనిభ మధ్యుష్టవలయం
స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుణ్డే కుహరిణి''

అని ఆనందలహరియం దీయంశమే శ్రీ శంకర భగవత్పాదులచే వివరింపఁబడినది.

**అవ** :- శక్తి ప్రవాహము ననుసంధించుటయే పరమయోగమని చెప్పుచున్నాడు.

మూ ॥ నభసః శీర్షద్వారా ప్రవహన్తీం య ఇహావిగ్రహేశక్తిమ్ ।
అనుసన్దధాతి నిత్యం కృతిన స్తస్యే తరైరలం యోగైః ॥ 8

కం. చేరి - దివినుండి శీర్ష
ద్వారమున శరీరమందుఁ బ్రవహించు నినున్
ధీరత నెప్పుడుఁ గనుసత్
పూరుషునకు నితరయోగములు మఱియేలా ?

ఆకాశమునుండి శిరో ద్వారమునఁ బ్రవహించుచున్న శక్తిని- సాధకుఁడగు నేయోగి నిశ్చలమగు బుద్ధిచే నిరంతరమును జూచుచుండునో, ఆపుణ్యపురుషునకు తదితరములగు యోగము లావశ్యకములు కానేరవు.

**ప్రభ**:- ప్రసన్నయు, అవిచ్ఛిన్నధారయు, నగుచు, ( ఎడతెగకుండ) ప్రవహించుచున్న మహాశక్తి యొక్క అనుగ్రహము సిద్ధమగునపుడు, తదితర యోగలక్ష్యములన్నియుఁ దమంతఁదామే సిద్ధించును. కావున నవి యపేక్షింపఁబడవని తాత్పర్యము.

''శక్త్యనుగ్రహమే సిద్ధి. తదితరము లావశ్యకములు కావు'' అని భావము.

**అవ** :- ఆయమ్మకందఱు బిడ్డలును సములేయయినను ఫలభేదముగలదని చెప్పుచున్నాఁడు.

మూ॥ సర్వేషు విశసితుల్యం, నిర్గచ్ఛసి తుల్యమమ్బ! భువనానామ్ ।
జ్ఞాతాచే దసిశక్త్యై నజ్ఞాతాచేద్ భవస్యహఙ్కృత్యై ॥ 9



కం. యాతాయాత విహారము
భూతములం దెల్ల తుల్యముగ జరిపియు, వి
జ్ఞాతవయి శక్తియు, నవి
జ్ఞాతవయి యహంకృతియు నొసంగెదవమ్మా!

త్రిభువన జననీ! నీ బిడ్డలగు, ఈ జంతువులన్నింటి యందును నీ వొకేవిధమున ప్రవేశ నిర్గమనములను జఱుపుచుందువు. కాని నినుఁదెలిసికొనినవారికే శక్తినిచ్చుచుందువు. తెలిసికొనని వారికహంకారమును గలిగించుచుందువు.

**ప్రభ** :- నీరాకపోకలను ( ఆరోహణావరోహణములను) తెలిసికొనిన వారు శక్తియుక్తులగుదురనియు, వానిని గ్రహింపజాలని వారు - శక్తి యుక్తులుగాక యహంకారయుక్తులగుదురనియు, మహాశక్తి - జంతువులన్నిటియందును సమానముగనే విహరించుననియుఁ దెలిసికొనునది.

**అవ** :- మహాశక్తి యొక్క యువతరణమును (మీఁది నుండి క్రిందికి దిగుటను) ధ్యానించుటచే నగుఫలమును దెలుపుచున్నాఁడు.

మూ॥ అవతరణం ధ్యాతంచే, దారోహణ మద్భుతం భవేచ్ఛక్తేః ।
యస్మిన్నిదం శరీరం భవతి మహద్వైద్యుతాగ్ని యన్త్రమివ ॥ 10

కం॥ దివినుండి వచ్చునీశ
క్త్యవతరణము ధ్యాతమైన నారోహణ మం
దు విచిత్రంబీతను
వవును, మహావైద్యుతాగ్ని యంత్రముపోల్కిన్.

ఆకాశమునుండి శిరోమార్గమునందుఁ బ్రవేశించుచున్న శక్తి యొక్క యవతరణమును, ఎవ్వఁడనుభవపూర్వకముగా దెలిసికొనుచుండునో, వాని మూలాధారమునుండి, ఈ శక్తి - మిక్కిలి వడిగా నారోహించుచుండును. (మీది

కెక్కుచుండును) అట్లారోహించునపుడు భౌతికమగు నీ శరీరము – మహావైద్యుతాగ్ని యంత్రము వలె నాశ్చర్యకరమగుచుండును.

**ప్రభ :-** జల సంబంధియగు జ్యోతిస్సునే ''వైద్యుతాగ్ని'' (విద్యుచ్ఛక్తి అని చెప్పుదురు.

ఈ వైద్యుతాగ్ని – భూమియందున్న యగ్నికంటె విలక్షణయై యంతరిక్షము నందుండును. ఈ భూమియందే జలసంధియగు నా వైద్యుతాగ్నిని అభివ్యక్తీకరించుట కేర్పఱుపఁబడిన యంత్రమును వైద్యుతాగ్నియని చెప్పుచున్నారు.

ఇప్పుడు భౌతికశాస్త్రజ్ఞులు – కల్పితమగు నా వైద్యుతాగ్ని యంత్రమును క్రియోపకారముగను, ప్రకాశదాయకముగను, నిర్మించియున్నారు. విద్యుచ్ఛక్తి వలనఁ బలువిధములగు పనులు జరుపఁబడుటయు, విద్యుద్దీపములు నిర్మింపబడుటయు, వర్తమానకాలమునందు సర్వజన ప్రసిద్ధమేగదా ! శక్తి – శిరస్సునుండి లోనికెట్లు ప్రవేశించుచున్నదియు, ఏకాగ్రమగు చిత్తమున ధ్యానించువారి శరీరము – ఈ విద్యుచ్ఛక్తి యంత్రమును బోలియుండునని చెప్పఁబడుచున్నది. ఇందలి యలంకారము – ఉపమ. ఇందుపమేయమగు శరీరమునకును, ఉపమానమగు వైద్యుతాగ్నికిని, గల సాధర్మ్యము – శక్తి ప్రకాశ విజృంభణమని యెరుంగునది.

**అవ :-** ధ్యానము నుపేక్షించినయెడల కలుగు నష్టములఁ దెల్పుచున్నాఁడు.

మూ॥ ఆరోహణమధ్యాత్మషు, హృదయేఽహఙ్కారమాత్రనిష్పత్త్యై
తదనుశరీరమిదం స్యాత్, సుఖాయదుఃఖాయవాయథాభోగమ్ ॥ 11

శా॥ ఏ రీతిఁ జరించుశక్తి నెద ధ్యా, నింపం బ్రవర్తింపరో,
వారల్ డెందమునం దహంకరణ సంప్రాప్తింగొనం జేయునీ
యారోహం, బపుడీ శరీరమును భోగార్థానుసారంబుగాఁ
బ్రారంభించు సుఖంబొ, దుఃఖమొ, యెదో బంధించు సర్వేశ్వరీ !



ఎవరీ శరీరములోఁ బ్రవహించుచున్న శక్తిని ధ్యానింపక యుపేక్షించుచుండుదురో, వారియం దీశక్త్యారోహణము – అశుద్ధమగు నహంకారమును బుట్టించుచుండును. తదుపరి (అహంకారము గలిగిన పిమ్మట) ప్రారబ్ధమగు (ఆరంభింపఁబడిన) భోగము ననుసరించి, ఈ శరీరమును – సుఖమో లేక దుఃఖమో (సుఖముగాని దుఃఖముగాని) బంధించుచుండునని తాత్పర్యము.

**ప్రభ :-** సంసారమునం దీశరీరము సుఖదుఃఖముల ననుభవించుటకే యేర్పడును గాని శక్తిప్రకాశ విలాసాత్మకమగు వైద్యుతాగ్ని యంత్రమువంటిది కానేరదని భావము.

**అవ :-** ఈ పరదేవత యొక్క సత్తయే (ఉనికియే) ఉపాధివశము చేత నహంకృతి యగుచున్నదనుచున్నాఁడు.

మూ॥ యావ్యక్తితా జనిమతా, మహఙ్కృతిః సకల భేదధీభూమిః
పృథగివతవామ్బికే! సాస్తైవోపాధి సంశ్రయాద్భాన్తీ ॥ 12

గీ. సకలభేద బుద్ధులకును సంశ్రయమయి
దేహి దేహికిఁ గలుచు వ్యక్తిత్వమగు, న
హంకృతి – ఉపాధి సంబద్ధమగుట, వేఱు
గాఁ గనంబడు నీసత్తయే గదమ్మ.

అంబికా! ఈ లోకమునందు వివిధములగు భేదములు గల బుద్ధులున్నవి. భిన్నములగు నా బుద్ధుల కన్నింటికిని గూడ మూలమీయహంకారమే. 'నేను వానికంటె వేఱు. వాఁడు నాకంటె వేఱు' అని ప్రతిదేహియు వేర్వేరగు నాత్మను గల్గియుండుట – వ్యక్తిత్వమని చెప్పబడును. ఆ వ్యక్తిత్వరూపమే యీ యహంకారము. ఏయహంకారము నేను, నాది, అని యిట్లు, వేర్వేరుగాఁ దోచునో, అదియంతయు

నుపాధిఁ సంబంధము వలన వేర్వేరుగాఁ బ్రకాశించుచున్న నీ సత్తయే, ( నీ స్వరూపమే) కాని వేఱొకటి కాదు.

**ప్రభ** :- అఖండ స్వరూపిణియగు నీమహాశక్తి - ఉపాధి భేదము చేత ప్రాణులకు భిన్నభిన్నమగు వ్యక్తిత్వమును బ్రకటింపఁజేయునది యగు నహంకార స్వరూపమై, వేఱు వేఱుగాఁ బ్రకాశించుచున్నదని యెఱుంగునది.

దేహరూపమగు నుపాధి సంబంధము చేతనే అధిపిండమైయున్న మహా శక్తికి - ఈపృథగ్ రూపమగు ప్రతిభావము కల్గెననియు దేహలయం దేర్పడిన యహంకారమంతయు నీ మహాశక్తియే యగుచుండుననియు నిందలి సారాంశము.

**అవ** :- ఈ భేద దృష్టినే ' అవిద్య' అని యందురని దానిని వర్ణించుచున్నాఁడు.

మూ॥ ఏతామాహుర విద్యాం, బీజం సంసారవృక్ష రాజస్య !
సర్వరస ఫలయుతస్య ప్రారబ్ధ జలేన దోహదినః ॥ **13**

కం॥ ప్రారబ్ధ నీరదోహది
యై, రమ్య సమస్త రసఫలాన్వితమగు, సం
సారతరు రాజమునకుం
గారణమగు నిది యవిద్యగా, నెన్నఁబడున్.

జనన మరణ రూపమగు పరివర్తనము - (తిరుగుడు) సంసారమని చెప్పఁబడును. ఈ సంసారమను వృక్ష రాజమునకు మీఁదఁ దెలుపబడిన యీయవిద్యనే (భేదదృష్టినే) కారణమని (విత్తనమని) చెప్పుదురు. వృక్షమునకు విత్తనమువలె సంసారమున కవిద్యయే (అజ్ఞానమే) కారణమని పెద్దలు చెప్పుదురు.



ఈ సంసారవృక్షము - సమస్త రసయుక్తములగు, ఫలములతోఁ గూడియున్నది. ప్రారబ్ధమనెడి జలము - ఈ సంసార వృక్షమునకు దోహదము చేయుచున్నది.

**ప్రభ** :- ఇందు సంసారము - వృక్షరాజముగా నారోపించఁబడుట వలన నిందలి యలంకారము రూపకమగుచున్నది.

సంసారపక్షమున - రసములు - శృంగార - హాస్య - కరుణ - రౌద్ర - వీర - భయానక - బీభత్స - అద్భుత - శాంతములు. 'ఫలము' అనఁగా ప్రయోజనము. బీజమనఁగా, కారణము. దోహదమనఁగా. స్పృహ. వృక్షపక్షమున - రసములు. తీపి, పులుపు, మొదలగు నారురుచులు. ఫలమనఁగా, పండు బీజమనఁగా విత్తనము. దోహదమనఁగా, చెట్టు పూవులు పూయుటకు ముందు కుశలులగువారిచేఁ జేయఁబడి పుష్పాదులను బుట్టించు ద్రవ్యము.

శ్లో॥ ''తరుగుల్మలతాదీనా మకాలే కుశలైః కృతమ్।
పుష్పాద్యుత్పాదకం ద్రవ్యం దోహదం స్యాత్॥''
అని శబ్దార్ణవము నుడువుచున్నది గదా !

ఇందలి యభిప్రాయము నిట్లెఱుంగునది :-

సంసారమూలము - అవిద్య. దానియందున్న రసములు - తొమ్మిది. ప్రార్ధమగు కర్మ - ఇచ్ఛాద్వారమున సంసారమును వృద్ధిఁబొందించును.

వృక్షమునకు - బీజము (విత్తు) కారణ ద్రవ్యము. దాని ఫలములకుఁ గల రసములు - ఆరు. అది దోహదక్రియచేఁ బుష్ప ఫలములనుగాంచును.

సమన్వితార్థము నిట్లెఱుంగునది :-

బీజము – కారణద్రవ్యముగాఁ గలిగి, షడ్రసములు గల ఫలములు గలిగియున్న వృక్షమునకు – దోహదక్రియ యథేష్టముగాఁ బుష్పాదులను గల్గించునట్లు, అవిద్య – మూలముగాఁ గలిగి, నవరసములు ప్రయోజనములుగాఁ గలిగియున్న సంసారమును – ప్రారబ్ధకర్మ (ఫలమిచ్చుట కారంభించిన పని) ఇచ్ఛాద్వారమున వృద్ధినొందించును.

**అవ** :- శరీరమునందు ఈ శక్తి – యెడతెగకుండ ప్రవహించు విధమును దెలుపుచున్నాఁడు.

మూ॥ వ్యక్తిత్వార్పకదేహే నిమ్నేకుల్యేవ నిజమతాం మాతః
ప్రవహత్యనారతం తే శక్తిశ్చిత్రాణి దేవితన్వానా ॥ 14

కం. సకల జనని ! వ్యక్తిత్వా
ర్పకమగు దేహమునఁ జిత్రరచయితయై పా
యక నీదుశక్తి - పల్లము
నకుఁ బోయెడి కాల్వ విధమునం బ్రవహించున్.

ఓ ప్రాణి లోకజననీ! ఈ శరీరము – దేహులందఱికిని గూడ నిట్లు వ్యక్తిత్వమును, అనగా భిన్న భిన్నమగు నాత్మ భావమును (అహంకారమును) సమర్పించుచు, శక్తి విలాసమున కుపాధిభూతమై యున్నది. ఇట్టి శరీరమునందు – నీ శక్తి – అత్యద్భుతములగు పనులను జేయుచు ఉన్నత స్థలము నుండి (మీద నుండి) క్రిందికిఁ బ్రవహించు కాల్వవలె, ఏయాటకంమును లేక అనాయాసముగాఁ బ్రవహించుచున్నది.

**ప్రభ** :- ఇందలి యలంకారముపమ. ఈ శరీర మీ దేహులకు పృథగాత్మ భావమును సమర్పించని యెడల నప్పుడీ యహంకారమే – శక్తి ప్రవాహమునకు ప్రతిబంధకమగునను నంశమిందు ధ్వనింపఁజేయఁబడుచున్నది. శక్తి – ఈ



శరీరమునందుఁ బ్రవహించుచు, చిత్ర విచిత్రములగు పనులను గావించుటకు హేతువు. ''దేహము నేను'' అనుతలంపే యగుచున్నది. దీనిని దొలఁగించుకొనుటయే – జన్మ సఫలత.

**అవ** :- క్రమముగా నాలు శ్లోకముల చేత హృదయ తత్త్వమును వివరించుచున్నాఁడు.

మూ॥ సారమపామణుభూతం హృదయస్థంసూరయో విదుశ్చిత్తం।
శ్రేష్ఠం ప్రాణం కేచన పఞ్చానిలమూలభూతమాహురిమమ్। 15

గీ. ధీరులతి సూక్ష్మమగుచు హృద్దేశవర్తి
యైన జలసారమును చిత్తమని వచింత్రు,
దీనిఁ గొందఱు బుధులైదు ప్రాణములకు
మూలమైన ముఖ్య ప్రాణముగ, దలంత్రు.

హృదయమునందున్న జలసారము – మిక్కిలి సూక్ష్మమైయున్నది, విద్వాంసులు దీనిని చిత్తమని యందురు. ఇక్కడ చిత్తమనగా జ్ఞానమని యర్థము. కొందఱు పండితోత్తములు జలసారమగు దీనికి పంచప్రాణములకును మూలమగు ముఖ్యప్రాణమని చెప్పుదురు.

**విశే** :- ఉపనిషత్తులయం దుపన్యసింపఁబడిన ముఖ్యము, శ్రేష్ఠమును నగు ప్రాణము – జలసారమనియు, నది హృదయమందుండుననియు, కొందఱు చెప్పుదురని గ్రహించునది. ఇదియే – ఇంద్రియముల నన్నింటిని తమతమ పనులయందుఁ బ్రవర్తింపఁ జేయునదగుట వలన దీనికి ముఖ్యత్వము సంగతమే యగుచున్నది.

మూ॥ మన ఏవ చిత్తసంజ్ఞం వ్యవహార తాం విభజనానభిజ్ఞానామ్!
కవిలోక వ్యవహార స్తదధీన స్తత్త్వ ధీర్భవత్యాన్యా ॥ 16

కం. మనసే చిత్తంబగు విధ
జన మెఱుగక వ్యవహరించు జనులకు, దానిం
గని, కవిలోకము నట్లనె
యను, ''తత్త్వమ్మరయ చిత్త మన్యమ్మె యగున్.''

మనస్సు వేఱు, చిత్తము వేఱు, అను విభజనము నెఱుఁగక వ్యవహరించువారగు మనుష్యులు – మనస్సు – చిత్తము, ఒక్కటేయని భ్రాంతిపడుచున్నారు. మూఢమగు నీలోకవ్యవహారము ననుసరించి కవులుగూడ మనస్సును – చిత్తమునకుఁ బర్యాయపదముగా బ్రయోగించుచున్నారు. వ్యవహార మిట్లేర్పడి యుండినప్పటికిని తత్త్వ వివేచికయగు బుద్ధి యిది కానేరదు. మనస్సు వేరు, చిత్తము వేరు' అనునదియే యథార్థమగు జ్ఞానము.

మూ॥ తదనాహతస్య విలసద్ దక్షిణతో దహరనామకగుహాయామ్।
చిత్తం కులకుణ్డాత్తే కాఽప్యనుగృహ్ణాతిదేవి! రశ్మికలా ॥ 17

చం. జనని! అనాహతాఖ్యమగు చక్రమునందగు దక్షిణస్థలం
బున- దహరాంబరాఖ్యగుహఁ - బొల్చినచిత్తముఁ దెల్ప వీలుగ
ల్గని భవదీయ రశ్మికల - గాదె యుపాధి సమర్పణ క్రియన్
గొని - సమనుగ్రహించుఁ గులకుండను నుండి జగన్మోహారిణి !

దేవి! షట్ చక్రములలోఁ జననదియు, యోగులచేతఁ జూడఁ బడునదియు, రొమ్మునడుమ నుండునదియు, నగు అనాహత చక్రమునకుఁ గుడివైపున దహరాకాశమను పేరుగల గుహయందు (రంధ్రమునందు) చిత్తము – ప్రకాశించుచున్నది. సంవిద్ (జ్ఞాన) రూపమగు నాచిత్తమును ఇట్టిదని చెప్పుటకు శక్యము కాని అనిర్వచనీయమగు నీయొక్క ప్రకాశాంశ విశేషము – (ప్రకాశమునందలి యొక భాగము) కులకుండమను పేరుగల మూలాధార చక్రము నుండి యనుగ్రహించుచుండును.



ప్రభ :- 'ఆత్మ' – స్వయముగా ప్రకాశించుచోటును, 'దహరాకాశము' అను పేరుగలదియు, అగు హృదయము – (చిత్తము) హృదయ పీఠమునకు దక్షిణ పార్శ్వమునందుండును' అని చెప్పిన తన గురువర్యుఁడగు భగవద్రమణ మహర్షి యుపదేశము నీయాచార్యుఁడు, రమణగీతయం దిట్లుచెప్పియున్నాఁడు.

శ్లో. ''తస్యదక్షిణతో ధామ హృత్పీఠే నైవవామతః।
తస్మాత్ ప్రవహతి జ్యోతిః సహస్రారం సుషుమ్నయా''

''హృత్ఫలకమునందు (రొమ్మునందు) హృదయము – కుడివైపున నున్నది. ఎడమవైపున కాదు. ఆ హృదయమునుండి సుషుమ్నా నాడీ మార్గమున జ్యోతిస్సు (వెలుతురు) సహస్రార చక్రమునకుఁ బ్రవహించుచుండును'' అనునది దీని యర్థము.

ప్రశ్న :- '' ఆత్మ స్వయముగా, (తనంతతానే) ప్రకాశించువాడు. అతఁడు ప్రకాశించు స్థలము – హృదయము'' అని భగవానుఁడగు మహర్షి యుప దేశింపఁగా నీ యాచార్యుఁడు–

''పరదేవతయొక్క ఒకానొక రశ్మికళ – మూలాధారమునుండి హృదయ స్థితమగు చిత్తము ననుగ్రహించుచుండును'' అని యేలచెప్పెనో ?

ఉత్త :- ఇది దోషముకాదు, ఈ శరీరము – పాంచభౌతికము. దీనిని ధరించుచున్న యాధారముల కన్నింటికిని మూలము – మూలాధారమునందే యుండుట ప్రసిద్ధము. కావున నీ మూలాధారము నుండియే శక్తికళ – హృదయమునందంతటను వ్యాపించియున్న నాడులకు తమతమ పనులను గావించుటకు దగిన సామర్థ్యమునను గ్రహించుచుండును.

కావుననే శక్తి కళ – చిత్తము ననుగ్రహించుచుండునను మాటకు – ఉపాధి సమర్పణమే – ఆయనుగ్రహమను నర్థము నెరుంగవలయును.

ఆత్మ – స్వత సిద్ధములగు సత్తా ప్రకాశములు గలవాఁడు కావున నతఁడు తదితరముల నపేక్షింపఁడుగదా !

మూ. చిత్తమణు శ్లిష్టం తే కలయాఙ్గుష్ఠ ప్రమాణమివభాసా ।
దర్పణమమలబ్రహ్మ ప్రతిబిమ్బా కర్షకం శివే ! భవతి ॥ 18

కం. అమల బ్రహ్మ ప్రతిబిం
బముఁ గైకొను దర్పణంబు – పరికింపఁగ చి
త్త మణువు, ప్రభ నంగుష్ఠ
ప్రమాణముగఁ దోఁచు త్వత్కళాలింగితమై.

ఈశ్వరీ! అద్దము – వస్తువు యొక్క ప్రతిబింబమును వలె చిత్తము ఆత్మయొక్క ప్రతిబింబమును గ్రహించును.

నీరశ్మికళచేత (అంశవిశేషము చేత) ఆలింగితమై, (కూడుకొని) యున్న యీచిత్తము – నీ కాంతిచేత అంగుష్ఠ ప్రమాణముగాఁ దోఁచుచుండును.

**ప్రభ** :- పురుషుఁడు – అంగుష్ఠప్రమాణుఁడు.'' (అంగుష్ఠమాత్రః పురుషః) అని చెప్పఁబడియెను. కాని విచారింపగా, పురుషుఁడు – అంగుష్ఠ ప్రమాణుఁడుకాఁడు. అతఁడు ప్రకాశించు స్థలము గూడ హృదయము కాదు. కావుననే, ప్రభ (కాంతి) చేత – అతఁడంగుష్ఠ ప్రమాణునివలె నొకానొక యోగ నిష్ఠాదశయందుఁ గాన్పించును. ఈ చిత్తము – హృదయస్థానోపహితమగు చిత్ ప్రకాశమే స్వరూపముగాఁ గలిగి – స్వచ్ఛమగు బ్రహ్మము యొక్క ప్రతిబింబము (ఛాయ) నాకర్షించు నద్దమువలె నున్నది.

అద్దమువంటిదగు నీ చిత్తమే – అణుస్వరూపమై యున్నది. ఈ చిత్తమణువైనను – దీనియందు శుద్ధమును, అఖండమును, అగు బ్రహ్మము – ఆత్మ రూపమున (తానుగా) ప్రకాశించుచుండునని తాత్పర్యము.



**వివ** :- ఉపాధి – (ఆధారము) అగుచిత్తము – అద్దము వంటిది. కేవలమగు శుద్ధ బ్రహ్మము – బింబమువంటిది. అద్దము వంటి చిత్తమునఁ బ్రకాశించుచున్న (కనఁబడుచున్న) ఆత్మయే ప్రతిబింబమువంటిదని యెఱుంగునది.

ఈ విషయమున భగవానుఁడగు రమణ మహర్షి యిట్లు చెప్పెను.

శ్లో॥ హృదయకుహరమధ్యే కేవలం బ్రహ్మమాత్రం
హ్యహమహ మితిసాక్షా దాత్మరూపేణ భాతి
హృది విశ మనసా స్వంచిన్వతా మజ్జతా, వా
పవన చలనరోధా దాత్మనిష్ఠో భవత్వమ్ ॥

హృదయమను గుహయొక్క మధ్యమునందున్న కేవలమగు బ్రహ్మమే – 'నేను నే' నని ప్రత్యక్షమై ఆత్మ రూపమునఁ బ్రకాశించుచున్నది కదా! నీవాత్మను వెదకుచు, మునుఁగుచున్న మనస్సు చేతనో, ప్రాణరోధము వలన మునుఁగుచున్న మనస్సు చేతనో, హృదయము నొంది, ఆత్మ నిష్ఠుడవుకమ్ము !

మూ॥ అన్తర మావర్తాభం ప్రతిబిమ్బ మకాయ మేతదీశస్య
అంగుష్ఠాభం ప్రాహు ర్మానేనోపాధి చైత్త భాసస్తే ॥ 19

కం. బయలై, సుడిఁబోలి, శరీ
ర యుతము గాని దగు నీశు ప్రతిబింబము – న
మ్మ యుపాధి చిత్తశోభా
చయమితి, నంగుష్ఠ మట్లెసఁగునంద్రు బుధుల్.

ఈశ్వరుని, ప్రతిబింబము –(నీడ) శరీరము లేనిది. అది – (ఆఛాయ) నీటియందేర్పడు సుడివలె బయలైయుండును. ఆ ప్రతిబింబము – నీ యుపాధియగు చిత్తమునకు సంబంధించిన కాంతియొక్క పరిమాణము చేత – అంగుష్ఠ ప్రమాణమగుచుండును. కావున ఆ ప్రతిబింబమును – పండితు లంగుష్ఠ ప్రమాణమని చెప్పుదురు.

**ప్రభ** :- ఇందు ప్రతిబింబము - ఉద్దేశ్యము, అంగుష్ఠప్రమాణము - విధేయము. చిత్తాకాశమునందు - అశరీరమగు నీశ్వర ప్రతిబంబము యొక్క ప్రకాశమును. అంగుష్ఠాకారమునుఁ గూడ - ఉపాధియగు చిత్తము చేత గ్రహింపఁబడుచున్న ప్రభ చేతనే సిద్ధించుచుండును. మిగిలినదంతయు గడచిన శ్లోకములను వ్యాఖ్యానించునపుడు తెలుపఁబడియెను.

మూ॥ దమ్పత్యోర్వాం రూప ప్రతివిమ్బౌ చక్షుషోః శివే! భవతః।
కులకుణ్డే హృదయే చాప్యరూపయో రేవకశ్చి దుల్లాసః॥ 20

గీ. అమ్మ! శుభ దంపతులగు మీయాకృతులకుఁ
గలుగు ప్రతివింబములు - నేత్రముల వెలుంగు,
రూపరహితాత్ములగు మీ స్వరూపములకె
మూల - హృదయంబు- లాధారములు గదమ్మ!

అమ్మవగు నో శివా! మీ యాలుమగల రూపముల యొక్క ప్రతిబింబములు - ఈ జీవుల యొక్క నేత్రములు రెండింటను బ్రకాశించుచుండును. మూలాధార చక్రమునందును, హృదయము (అనాహతచక్రము) నందును, మీరు రూపరహితు లగుచునే ప్రకాశించుచుందురు.

**ప్రభ** :- ఎడమ కంటియందును, కుడికంటియందును గల జ్యోతిర్మయము అగురూపములు - ఈశ్వరీ - ఈశ్వరుల ప్రతిబింబములని గ్రహించునది. ''య ఏషోఽక్షిణి పురుషో దృశ్యతే. ఏష ఆత్మేతి హోవాచ.'' అని బృహదారణ్యకము నందు - అక్షి పురుష విద్య చెప్పఁబడినదిగదా! ఈ యంశమును నా చేత నాంధ్రీకృతమగు ఈశావాస్యోపనిషత్తునందలి **146** పేజీయందుఁ జూచునది.

**అవ** :- చిత్తమును స్తుతించుచున్నాఁడు.

మూ॥ చిత్తమణీయో విత్తం య ఇదంమూర్ధ్న్యే ప్రపశ్యతో ఽప్యధికమ్
హృదయగుహాయాం నిహితం, జానీతే సవిజహాతి బహి రా శాః 21



మ॥ 'దహరాకాశమనన్ విరాజిల్లుచుహృద్ధామాహ్వయం బౌగుహన్
నిహితంబై, యతి సూక్ష్మమై జగముకంటెన్ మిక్కుటంబై, శుభా
వహమౌ విత్తము - చిత్తమందెఱుఁగు, నెవ్వాఁడా మహావ్యక్తి, తా
బహిరాశా పరివర్జితుండయి సముద్భాసించు లోకేశ్వరీ!

ఏ మహా పురుషుఁడు మీదఁ దెలుపబడిన చిత్తమును దహరాకాశ నామమగు హృదయమునందున్నదియు, ప్రపంచము కంటెను కూడ వెలచే నధికమైనదియు, మిక్కిలి సూక్ష్మమయినదియు, హృదయ గుహయందున్నదియు నగు విత్తమని తెలిసికొనుచున్నాఁడో, ఆ మహాపురుషుఁడు - బాహ్యములగు కామముల నన్నిఁటిని విడిచినవాఁడగుచున్నాఁడు.

**అవ** :- సాధన దశయందు స్వాభిమతమును, హృదయ మూలమును, శక్తి జ్వాలామయమును, అగు నిష్ఠను జెప్పుచున్నాఁడు.

మూ॥ అప్రాప్తామూర్ధానం, హృదయాత్ సప్రస్థితా ధృతానాడ్యా
త్వద్రుచి రుక్తాబుద్ధి స్త్వయినిష్ఠా భవతి దేవి! తన్నిష్ఠా॥ 22

కం. హృదినుండి యుద్గమించున్,
గదియదు మస్తకముఁ బ్రాణ నాడీ ధృతమౌ,
నది - నీ రుచి - బుధ్యాఖ్యము,
తదుదిత నిష్ఠయె సవిత్రి! త్వన్నిష్ఠయగున్.

ఓ సవిత్రీ ! నీ యొక్క కాంతి విశేషము - హృదయమునుండి మీఁదికిఁబోయి శీర్షమును బొందక సూక్ష్మమగు ప్రాణ (అమృత) నాడి చేత ధరింపఁబడుచున్నది. అది - బుద్ధి (బోధము) అని చెప్పఁబడుచున్నది. ఆ కాంతి జ్వాలయందు స్థిరముగా నెలకొనుటయే - భగవతివగు నీయందలి నిష్ఠయగుచున్నది.

**ప్రభ** :- శిరస్సు వఱకును వెళ్ళకుండ హృదయము నుండి మీఁదికిఁ బ్రసరించుచు అమృతనాడిచే ధరింపఁబడియున్న శక్తి యొక్క బోధ జ్వాలయే – బుద్ధియనియు, దానిని గ్రహించుటయే పరదేవతానిష్టయనియు, నెఱుఁగునది.

**అవ** :- హృదయ – మనస్సులకుఁ గల సంబంధము – సూర్య చంద్రులకుఁ గల సంబంధమువంటిదని చెప్పుచున్నాఁడు.

మూ॥ అన్నమయాణుం ప్రాప్తం, ధీర్జ్యోతిశ్చన్ద్ర మార్క మివ తేజః।
పరిభాష్యతే మహేశ్వరి! మన ఇతిసఙ్కల్ప సమ్భవస్థానమ్ ॥ **23**

గీ ॥ సౌరమయి వెల్గు జ్యోతిస్సు - చంద్రునట్టు
లన్న మయమౌ నణువులనొందియున్న బుద్ధి
తేజము - మనస్సని వచింత్రు ధీరులదియె
సకల సంకల్ప సంభవస్థాన మమ్మ!

ఓ మహేశ్వరీ! సూర్య సంబంధియగు తేజము చంద్రుని బొందియున్నట్లు, మీఁది శ్లోకమునఁ జెప్పఁబడిన బుద్ధిజ్యోతి – అన్నమయమగు నణువును బొందియుండును. అదియే – మనస్సని చెప్పఁబడుచున్నది. ఆ మనస్సునందే సమస్త సంకల్పములును బుట్టుచుండును.

**ప్రభ** :- హృదయమునుండి బయలు వెడలిన బోధజ్వాల – శిరస్సువఱకును బోకుండునపుడు బుద్ధియని చెప్పఁబడుచున్నది. అదియే. సమస్త సంకల్పములను బొడముస్థలమగు శిరస్సునకుఁ బోవునపుడు మనస్సని చెప్పఁబడుచున్నది.

సూర్య సంబంధియగు తేజము – చంద్రునకుఁ బ్రకాశము నిచ్చునట్లు, హృదయ సంబంధియగు బోధజ్వాల – మనస్సునకు ప్రకాశమునిచ్చుచున్నదని భావము' సకల సంకల్పస్థానమగు శిరస్సును బొందునపుడీ బుద్ధియే మనస్సని చెప్పఁబడునని యెఱుంగునది.



**విశే** :- హృదయమునుండి బయలు వెడలిన యీబోధ జ్వాల – శిరస్సున కెక్కకుండునట్లు ధ్యానము చేత ధరింపఁబడినయెడల నదియే మహేశ్వరీ నిష్ఠయగునని గుర్తించునది.

**అవ** :- లక్ష్యస్థానమగు శిరస్సునందుఁగూడ చిచ్ఛక్తి నుపాసించు విధమును దెలుపుచున్నాఁడు.

మూ॥ సఙ్కల్పే సఙ్కల్పే చిచ్ఛక్తిం మనసివిస్ఫుర న్తీం త్వామ్।
య ఉపాస్తే సజనస్తే, గృహ్ణాతి మహేశవల్లభే! చరణమ్॥ **24**

గీ॥ తలఁపు తలఁపున నిజమనోధామమందుఁ
జెలఁగు చిచ్ఛక్తి, నిన్ను పాసించుచుండు
పుణ్యపురుషుండు - నీ పదాంబుజముఁ బడసి
ధన్యుఁడగును మహేశ కాంతామతల్లి!

ఓ పరమేశ్వరీ! ప్రతి సంకల్పమునందును మనస్సునఁ బ్రకాశించుచున్న చిచ్ఛక్తివగు నిన్నెవఁడు పాసించునో, వాఁడు నీ పాదమును గ్రహించును.

**ప్రభ** :- చంద్రునకు సూర్యప్రకాశమువలె, మనస్సునకు హృదయ ప్రకాశము– చిత్తుయొక్క శక్తి చేతనే సమర్పింపఁబడుచుండును. ఆచిచ్ఛక్తి ప్రజ్వలించి ప్రతి సంకల్పమునందును విరాజిల్లుచుండును. సంకల్ప ప్రకాశికయగు – ఈ చిచ్ఛక్తి నెవఁడు ధ్యానించునో, వాడు – నీ పాదమును గ్రహించినవాఁడగు చున్నాఁడు, కాని సంకల్పమును గ్రహించినవాఁడు కాఁడు, వాఁడే ధన్యుడు,.

చిత్ ప్రకాశమున దృష్టినిలుపుట వలన – సంకల్పములయందలి గురి – విడువఁబడునని భావము.

**అవ** :- చతుర్థస్తబకము నుపసంహరించుచున్నాఁడు.

మూ॥ ఆధారచక్రశయనే, మమేహ నిద్రాం విహాయ విచలన్తీం।
గీతయ ఏతాః పరమా ముపతిష్ఠన్తాం జగద్విభోః కాన్తామ్॥ 25

గీ. అస్మదాధార చక్రశయమునందు
నిదుర విడనాడి మేల్కొని కదలుచున్న
పరమ శుభధామ, త్రిజగదీశ్వరుని రామ
ప్రీతి నాలించుఁగాత! మద్గీతి రచన.

మూలాధారచక్రమను శయనము నుండి నిదుర మేల్కొని, ప్రపంచ వ్యాపారము నొనర్చుచున్న శ్రేష్ఠురాలగు పరమేశ్వరపత్నిని – నా చేత రచింపఁబడిన గీతులు భుజించుఁగాత! ఆ పరమేశ్వరకాంత – నాగీతిరచన సాదరముతో వినుఁగాక!

ఇతి శ్రీ మహర్షి రమణభగవత్పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః గణపతిమునేః కృతౌ
ఉమాసహస్రే చతుర్థ స్తబకః॥
సమాప్తమ్ ప్రథమమ్ శతకమ్॥

ఇది శ్రీ మహర్షి రమణభగవత్పాదశిష్యుఁడు, శతమహర్షణ
సగోత్రుఁడు– శ్రీ మత్పంతుల పేరయశాస్త్రి పౌత్రుఁడు –
వేంకటరామ బుధేంద్ర ద్వితీయపుత్త్రుఁడు అగు
లక్ష్మీనారాయణశాస్త్రి చేత నాంధ్రీకరింపఁబడిన
ఉమాసహస్రమను స్తోత్రకావ్యమున
ప్రథమ శతకము

( ఈ ప్రథమ శతకము తే. 10-8-1943 దీని ఆంధ్రీకరింపఁబడి తే8-5-1946దీని శ్రీరమణ భగవానునికి వినిపించి, సమర్పింపఁబడినది.)

ఓమ్. తత్. సత్.

****



ఓం నమోభగవతే శ్రీరమణాయ
శ్రీ భారతీ దేవ్యై నమః

# ఉమాసహస్రము

(ఆంధ్రప్రభా సహితము)

## (ద్వితీయ శతకమున ప్రథమ స్తబకము)

మూ॥ శ్రీఖణ్డ చర్చామివకల్పయన్తోముహుఃకపోలేషుసఖీజనస్య।
శ్రీకణ్ఠకాన్తాహసితాంకురాణాం శ్రీమన్తికుర్వన్తుజగన్తిభాసః॥ 1

చందనలేపమును సదా సఖీజనము కపోలములఁ సంధించునదియుఁ బోలిన సర్వేశప్రియకాంతా బంధురహాసి తాంకురములప్రభా పరంపర, జగతీ బృందమ్మును సౌభాగ్యాన్వితముగ నొనరించుఁగాత!

శివునికాంతయగు ఉమాదేవత యొక్క చిరునవ్వులు క్రొత్త మొలకలవలె నుండును. ఆనవ్వు మొలకలతళుకులు ఆయమ్మయొక్క సకియల చెక్కిళులందు మంచిగంధపు పూతను పూయుచున్నవి వలెనున్నవి. ఆ చిరునవ్వు మొలకల వెలుగులు లోకముల నన్నిఁటినిగూడ శ్రీమంతములుగా నొనర్చుఁగాత!

చందనలేపమున్ సఖుల – చారుక పోలములందు నిత్యమున్
బొందుగఁ గూర్చుచున్నదియుఁ బోలి వెలుంగు మహేశ్వరప్రియా
సుందర మందహాసముల శోభలు – స్మాత్మకళాలసజ్జగద్
బృందము నెల్లవేళలను శ్రీ లలితంబునొనర్చుఁ గావుతన్.

**ప్రభ** :- పర్వతరాజపుత్రి చెంతనున్న సఖీమణు లిద్దఱేయనియు వారు జయావిజయలనియు శివ పురాణము నుడువుచున్నది. పార్వతికి బాల్యమునందనేక